

ఒకే ఒక్కడు!

విద్యావ్యవస్థను బలోపేతం చేస్తామంటున్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. 8లో▸



వ్యసనాల బారిన పడొద్దు

విద్యార్థులు, యువకులు వ్యసనాల బారిన పడొద్దని ప్రముఖ వక్త భాస్కర యోగి సూచించారు. 8లో▸



కటాక్షం ఎవరికో?

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకం ఎవరిని వరిస్తుందోనని మహిళలు ఆశగా ఎదురుచూస్తున్నారు. 9లో▸

మద్యం షాపులు 59 దరఖాస్తులు 2,634



వైన్స్ టెండర్లకు ముగిసిన ప్రక్రియ

- చివరి రోజు 833 అప్లికేషన్లు
- అత్యధికంగా వికారాబాద్‌లో..
- సమకూరనున్న ఆదాయం రూ. 52.68 కోట్లు
- రెంటల్ ద్వారా మరో రూ. 65కోట్లు
- ఈ నెల 21న లక్కీ డ్రా



దరఖాస్తుల ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు

వికారాబాద్: అందరూ ఊహించినట్లుగానే జిల్లాలో మద్యం దుకాణాలకు పోటీ పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి దరఖాస్తుల సంఖ్య భారీగా నమోదైంది. లక్కీ డ్రాలో షాపులు ఎవరికి దక్కుతాయోనన్న ఉత్కంఠ వ్యాపారుల్లో నెలకొంది. 2021 మద్యం పాలసీని యథాతథంగా అమలు చేస్తున్నారు. గత ఏడాది తరహాలోనే ఈ సారి కూడా రెంటల్ ద్వారా ఆదాయం సమకూరనుంది. ఈ సారి జిల్లాలో మద్యం షాపులకు దరఖాస్తులు రెండింతలకు మించాయి. ఆదాయం కూడా అదే తరహాలో పెరగనుంది. మొదట్లో మందకొడిగా సాగిన దరఖాస్తుల ప్రక్రియ చివరి రెండు రోజుల్లో ఊపందుకొని వెయ్యికి పైగా అప్లికేషన్లు వచ్చాయి.

మొత్తం దరఖాస్తులు 2,634

జిల్లాలో 59 మద్యం దుకాణాలు ఉండగా 2,634 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఏడాది కూడా 2021 తరహాలోనే రిజర్వేషన్లు అమలు చేశారు. 2021లో 923 దరఖాస్తులు రాగా ఈ సారి దాదాపు మూడింతలు వచ్చాయి. గతేడాది అత్యధికంగా వికారాబాద్ పరిధిలోని 33వ మద్యం దుకాణానికి 41 దరఖాస్తులు రాగా ఈ ఏడాది వికారాబాద్‌లోని 32వ షాపునకు 91 దరఖాస్తులు వచ్చాయి. అదే స్థాయిలో తాండూరు పరిధిలోని 13వ దుకాణానికి 83, వికారాబాద్‌లోని 29వ షాపునకు 76, 27వ దుకాణానికి 72, మోమిన్‌పేట పరిధిలోని 35వ షాపునకు 79, పరిగిలోని 49వ దుకాణానికి 78, కొడంగల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 58వ షాపునకు 75 దరఖాస్తులు వచ్చాయి. గతేడాది దరఖాస్తుల రూపంలో రూ. 18.46 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ. 52.68 కోట్ల ఆదాయం సమకూరనుంది. అధికారుల అంచనా ప్రకారం రెంటల్ ద్వారా 2023 – 25 కాలానికి గాను రూ. 65కోట్ల ఆదాయం రానుంది.

సిండికేట్ మయం

మద్యం వ్యాపారులు ఎక్కువ శాతం వ్యక్తిగతంగా కంటే సిండికేట్‌గా మారి దరఖాస్తులు వేయడానికే మొగ్గు చూపారు. చాలా చోట్ల ప్రభుత్వ ఉద్యోగులు సైతం వారి కుటుంబ సభ్యుల పేరిట దరఖాస్తులు వేశారు. మహిళలు కూడా పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేశారు. ఉపాధ్యాయులు, సర్పంచులు, ఎంపీపీలు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు దరఖాస్తు చేయడం కనిపించింది. అయితే కొడంగల్, తాండూరు ప్రాంతాల్లో మద్యం విక్రయాలు బాగానే ఉన్నా కొన్ని షాపులకు దరఖాస్తులు తక్కువ రావడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

సర్కిల్ పేరు	షాపుల సంఖ్య	2021లో వచ్చినవి	ప్రస్తుతం వచ్చినవి
వికారాబాద్	15	289	866
పరిగి	12	183	564
తాండూరు	18	236	582
మోమిన్‌పేట్	06	78	349
కొడంగల్	08	137	273
మొత్తం	59	923	2,634



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

హరిత లక్ష్యాన్ని పూర్తి చేయండి

- అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: జిల్లాలో హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హరితహారం, గృహలక్ష్మి, ఇంటి పట్టాల పంపిణీ, జీవో 59, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, బీసీ, మైనార్టీలకు లక్ష రూపాయల ఆర్థిక సాయం, గొర్రెల పంపిణీ, కారుణ్య నియామకాలు వంటి వాటిపై చర్చించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో హరితహారం మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. గొర్రెల పంపిణీ యూనిట్లు గ్రౌండింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీసీ కులవృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సాయానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. స్క్రూట్నీ పూర్తి చేసి జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులరైజేషన్ పత్రాలు పంపిణీ చేయాలన్నారు. కారుణ్య నియామకాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డీఆర్‌డీఓ కృష్ణన్, డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్, వ్యవసాయ అధికారి గోపాల్, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సుధారాణి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేటి 5కే రన్‌ను సక్సెస్ చేద్దాం

వికారాబాద్ అర్బన్: ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 19న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5కే రన్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ సీ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో 5కే రన్ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం ఉదయం 6గంటలకు పట్టణంలోని ఎన్నేపల్లి ఎక్స్ రోడ్డు నుంచి ఆలంపల్లి ఎక్స్ రోడ్ వరకు 5కే రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు, డిగ్రీ కళాశాల విద్యార్థులు, క్రీడాకారులు,వాకర్ అసోసియేషన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, కలెక్టరేట్‌లోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. 5కే రన్ విజయవంతం చేసేందుకు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి హనుమంతరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి మల్లేశం, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లాస్థాయి అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అన్ని హంగులతో జీపీ భవనాలు

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



జాపర్‌పల్లిలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

పరిగి: అన్ని హంగులతో గ్రామ పంచాయతీ భవనాలు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని జాపర్‌పల్లిలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీలో జీపీ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, ఎంపీడీఓ శేషగిరి శర్మ, సర్పంచ్ అనిత, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

వికారాబాద్ అర్బన్: యూపీఎస్సీ సివిల్ సర్వీస్ పరీక్ష కోసం 2023–24 విద్యా సంవత్సరంలో 100 మంది మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి సుధారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం ,క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పారసీ అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 20న జరగాల్సిన స్క్రీనింగ్ టెస్ట్‌ను ఆగస్టు 28వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040 2323 6112లో సంప్రదించాలని సూచించారు.

టెంకాయల విక్రయానికి వేలం



టెంకాయల విక్రయానికి వేలం నిర్వహిస్తున్న అధికారులు

కుల్కచర్ల: పాంబండ దేవస్థానంలో టెంకాయల విక్రయానికి శుక్రవారం వేలం నిర్వహించారు. శ్రావణ మాస చిన్న జాతరను పురస్కరించుకుని సెప్టెంబర్ 9నుంచి 16వ తేదీ వరకు టెంకాయలు విక్రయించడానికి వేలం నిర్వహించారు. బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన ఈరప్ప రూ. 2లక్షల పాట పాడి వేలం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ రాములు, ఈఓ సుధాకర్ మాట్లాడుతూ.. పాంబండ ఆలయ అభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మయ్య, సంజీవులు, చిన్నారెడ్డి, వెంకటయ్య, మల్లేశ్, అర్చకులు పాండు పాల్గొన్నారు.

కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మాణెమ్మ



పెద్దేముల్: కోట్‌పల్లి–పెద్దేముల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మారేపల్లి గ్రామానికి చెందిన కొమ్ము మాణెమ్మను నియమించారు. వైస్ చైర్మన్‌గా మమ్మద్ ఫయాజొద్దీన్, డైరెక్టర్లుగా నల్ల వెంకటరెడ్డి, ఉప్పరి నారాయణ, రాథోడ్ రామ్‌షెట్టి, అంజిలమ్మ, లక్ష్మణ్, దేశ్‌ముఖ్ అనీల్ కుమార్, కుమ్మరి కవిత, అనంతయ్య, శ్రీనివాస్, మమ్మద్ శిబ్లీ, నర్సపూర్ శీధర్, విజయకుమార్‌ను నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

21న స్పాట్ అడ్మిషన్లు

అనంతగిరి: వికారాబాద్ పరిధిలోని మోమిన్‌పేట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో, ఫిజియోథెరపీ గ్రూపుల్లో సీట్ల భర్తీ కోసం ఈ నెల 21న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అడ్మిషన్లు మొయినాబాద్ పరిధిలోని చిలుకూరు గురుకుల పాఠశాలలో జరగనున్నట్లు తెలిపారు. 2023 సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 7995010632లో సంప్రదించాలని సూచించారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

- కార్యకర్తలు సైనికుల్లా శ్రమించాలి
- అవినీతి ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం చౌడాపూర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ బూత్ ఎన్‌రోలర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేస్తూ, కాంగ్రెస్ హయాంలో పేదలకు అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ మాయమాటలను ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. కొత్త ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీ విధానాలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, పార్టీ మండల ఉపాధ్యక్షులు నర్సింహనాయక్, దామోదర్ రెడ్డి, కుల్కచర్ల మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, ఎస్టీ సెల్ జిల్లా నాయకుడు శివరాం నాయక్, నాయకులు గోపాల్ నాయక్, రాంచంద్రయ్య, రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అవినీతిపై పోరాటం

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య

కుల్కచర్ల: రాష్ట్ర ప్రజలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాయమాటలతో మోసం చేస్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య ఆరోపించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరులో సర్కారు మాట తప్పడాన్ని నిరసిస్తూ శుక్రవారం కుల్కచర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులకు మూడెకరాల భూమి, ప్రతి ఇంటికీ ఉద్యోగం అన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ హామీలను గాలికి వదిలేసిందన్నారు. గృహలక్ష్మి పథకం పేరిట మరో మోసానికి పాల్పడుతోందని మండిపడ్డారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే రూ. 3లక్షలు సరిపోవని, రూ. 5 లక్షలు ఇవ్వాలని తాము డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అవినీతిపై నిరంతర పోరాటం కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు వెంకటయ్య, మాజీ సర్పంచ్ జానకీరాం, వార్డు సభ్యులు ఆంజనేయులు, మైపాల్, నాయకులు సంతోష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

‘పాత పెన్షన్’ అమలు చేయాలి

అనంతగిరి: సీపీఎస్, పీఎఫ్ఆర్‌డీ చట్టాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం డిమాండ్ చేశారు. సెప్టెంబర్ ఒకటిన నగరంలోని ఇందిరా పార్క్ వద్ద చేపట్టనున్న మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం వికారాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను వర్తింపజేయాలన్నారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను చేపట్టాలన్నారు. జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్లకు 40 శాతం అవకాశం కల్పించాలని కోరారు. 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఎస్‌టీఓ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు బాబురావు, రత్నం, వినోద్, రాములు, రవీందర్, బాలయ్య, ప్రభాకర్, పరమేష్, అజయ్‌కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్, బుచ్చన్న, వెంకటయ్య, తిరుపతి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పోలీస్ స్టేషన్‌లో పాము కలకలం

బషీరాబాద్: బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ శుక్రవారం నాగుపాము కలకలం రేపింది. బయట నుంచి స్టేషన్‌లోకి దూరిన పాము పోలీసులకు చెమటలు పట్టించింది. ప్రదీప్ అనే వ్యక్తిని పిలిపించి పామును పట్టించారు. స్టేషన్ పక్కనే పిచ్చి మొక్కలు ఉండడంతో అక్కడి నుంచి పాము వచ్చి ఉంటుందని పోలీసులు తెలిపారు.





సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నేటితరం నాయకులు ఆయన పోరాట పటిమను అందిపుచ్చుకోవాలని సూచించారు. బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆవిష్కరించారు.

- బొంరాస్‌పేట

‘పట్నం’ అస్త్ర సన్యాసం!

- తాండూరు అసెంబ్లీ రేసు నుంచి తప్పుకొన్న మహేందర్‌రెడ్డి?
- ఎమ్మెల్సీ మద్దతుదారుల్లో ఆగ్రహావేశాలు
- ఆయనను నమ్మి రాజకీయ భవిష్యత్తు కోల్పోయామని ఆవేదన

తాండూరు: మూడు దశాబ్దాలుగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రాజకీయ చక్రం తిప్పిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అస్త్ర సన్యాసం చేశారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. నెల రోజుల క్రితం వరకు తాండూరు టికెట్ నాదే.. గెలిచేది నేనే అంటూ ప్రెస్ మీట్లు పెట్టి మరీ ప్రకటించిన పట్నం మహేందర్‌రెడ్డి ఒక్కసారిగా రేసు నుంచి తప్పుకోవడం ఏంటనే చర్చ సాగుతోంది. ఆయన్ను కలిసేందుకు వెళ్లిన నాయకులకు బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని చెబుతుండడం మద్దతుదారులను అయోమయానికి గురి చేస్తోంది. 1994 ఎన్నికల్లో తాండూరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నాటి నుంచి వెనుకడుగు వేయలేదు. రాజకీయాల్లో అంచెలంచలుగా ఎదుగుతూ వచ్చారు. ఆయన సతీమణి పట్నం సునీతారెడి వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా, సోదరుడు నరేందర్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బలమైన కేడర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తాండూరు నియోజకవర్గంలో క్రియాశీలక రాజకీయాలు చేస్తు వచ్చారు. నెల రోజుల క్రితం వరకు తాండూరు టికెట్ నాకే వస్తోందని చెబుతూ వచ్చారు. అయితే ఒక్కసారిగా యూటర్న్ తీసుకొని రేసు నుంచి తప్పుకొన్నారు. దీంతో మద్దతుదారులు, బీఆర్ఎస్ నాయకులు మండిపడుతున్నారు. 2018 ఎన్నికల తర్వాత పార్టీలో రాజకీయ సమీకరణాలు మారినా.. తాము పట్నం వెంటే ఉన్నామని, ఆయన ఇలా చేయడం ఏమిటని ఆగ్రహంతో రగిలిపోతున్నారు. మహేందర్‌రెడ్డి మాటలను నమ్మి తమ రాజకీయ భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకున్నామని వాపోతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి గెలుపునకు సహకరించేది లేదని తెగేసి చెబుతున్నారు. మహేందర్‌రెడ్డి మద్దతుదారుల్లో కొందరు పార్టీ మారే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఎన్నికలకు మరో మూడు నెలలు గడువు ఉండడంతో అప్పటిలోగా ఏమైనా కావచ్చు అనే ధోరణిలో మహేందర్‌రెడ్డి ఉన్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.



పట్నం మహేందర్‌రెడ్డి

చర్యలకు డిమాండ్

తాండూరు టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల వద్ద డబ్బులు వసూళ్లు చేసిన అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలంటూ బీఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రిన్సిపల్ రాజ్‌మోహన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఇదే విషయమై ఆరా తీసిన ప్రిన్సిపల్ అది అవాస్తమని తేల్చారు.

ఒకే ఒక్కడు!



మండల విద్యావనరుల కేంద్రం

18 మండలాలకు ఇన్‌చార్జి ఎంఈఓలే దిక్కు

- కొరవడిన విద్యాలయాల పర్యవేక్షణ
- గాడి తప్పుతున్న విద్యావ్యవస్థ
- పది ఫలితాలే నిదర్శనమంటున్న విద్యావేత్తలు

పరిగి: విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు సరైన బోధన అందడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీటికి తోడు పాఠశాలలను పర్యవేక్షించాల్సిన రెగ్యులర్ ఎంఈఓలు కూడా లేకపోవడంతో సమస్య తీవ్రతకు కారణమవుతున్నట్లు సమాచారం. ఫలితంగా విద్యావ్యవస్థ గాడి తప్పుతుందని, అందుకు ఈ ఏడు వచ్చిన పది ఫలితాలే ఇందుకు నిదర్శనమని పలువురు విద్యావేత్తల అభిప్రాయం.

మొత్తం ఇన్‌చార్జిలే

జిల్లాలో మొత్తం 19 మండలాలు ఉండగా.. వీటిలో 1,063 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిని పర్యవేక్షిస్తూనే.. ప్రైవేటు విద్యాలయాలను పర్యవేక్షిస్తూ.. సమస్యలు తెలెత్తకుండా మండల విద్యాధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఎంఈఓల కొరతతో పర్యవేక్షణ కొరవడినట్లు తెలుస్తోంది. సుమారు 8 సంవత్సరాలుగా ఎంఈఓల పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం జిల్లాలో ఒక్కరే రెగ్యులర్ ఎంఈఓతో కాలం వెళ్లదీస్తున్నారు. మిగతా 18 మండలాల్లో ఇన్‌చార్జిలే పనిచేస్తున్నారు. ఉన్న ఆ ఒక్క ఎంఈఓ హరిశ్చందర్ దోమ మండలంలో విధులు నిర్వహిస్తూ పరిగి, పూడూర్‌కు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

పర్యవేక్షణ అంతంతే

ఒక రెగ్యులర్ ఎంఈఓ మూడు మండలాలకు పనిచేస్తున్నారు. మిగతా 16 మండలాల్లో ఒక ప్రధానోపాధ్యాయుడు ఆ మండల ఇన్‌చార్జి ఎంఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో వారు అటు హెచ్‌ఎం, ఇటు విద్యాధికారిగా విధులు నిర్వహించలేక సతమతమవుతున్నట్లు సమాచారం. అధికారిక కార్యక్రమాలు, సమీక్షలకు హాజరు కావడం, మధ్యాహ్న భోజన నివేదికల తయారీ, ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, జీతభత్యాలు, ప్రగతి నివేదికలు పంపించడంతో పాటు మనఊరు–మనబడి పనులను పర్యవేక్షించాల్సి ఉంటుంది. పనిభారంతో ఇవేమీ సరిగ్గా చేయలేకపోతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా క్షేత్రస్థాయిలో పలు సమస్యలను పరిష్కరించేందుకు నోడల్ ఆఫీసర్లను నియమించగా వీరు మండలంలో పర్యవేక్షిస్తూనే తొలిమెట్టు, ఉన్నత అధికారులు అడిగిన నివేదికలు సమర్పించడానికే పరిమితమవుతున్నారు. అలా కాకుండా పూర్తిస్థాయి బాధ్యతలతో ఎంఈఓలను నియమిస్తే బాగుంటుందని ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తల అభిప్రాయం.

వ్యసనాల బారిన పడొద్దు

- తల్లిదండ్రులను స్ఫూర్తిగా తీసుకోవాలి
- యువత, విద్యార్థులకు ప్రముఖ వక్త భాస్కరయోగి పిలుపు
- విద్యాహక్కు చట్టం, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సమావేశం

కుల్కచర్ల: జీవితంలో ఎదగాలంటే సినిమా హీరోలను కాకుండా.. తల్లిదండ్రులను స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రముఖ వక్త భాస్కర యోగి అన్నారు. విద్యాహక్కు చట్టం అమలు, ఆత్మహత్యలు, బాల్య వివాహాల నిర్మూలన అంశంపై పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్, వ్యసనాల మోజులో పడుతున్న కొంతమంది యువత, విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆధునిక టెక్నాలజీని మంచి పనులకు వినియోగించాలన్నారు. అనుక్షణం పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడే తల్లిదండ్రులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. చదువుకునే వయసులో ప్రేమ, ఆకర్షణ వంటి వాటికి ఎంతదూరంగా ఉంటే జీవితంలో అంత ఉన్నత స్థితికి చేరుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, పీఎన్‌పీఎస్ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఎంఈఓ హబీబ్ అహ్మద్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వెంకటయ్య, సంఘం నాయకులు సాయిక్రిష్ణ, గోపాల కృష్ణ, ముకుంద, భరత్ కుమార్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రముఖ వక్త భాస్కరయోగి

లారీ దొంగ చిక్కాడు

- ఈ నెల 9న లారీ ఎత్తుకెళ్లే క్రమంలో వాహనదారుడిని ఢీకొట్టిన నిందితుడు
- బాధితుడి మృతితో వాహనం వదిలేసి రైలులో పరారు
- కరన్‌కోట్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పలు సెక్షన్ల కింద కేసులు నమోదు, రిమాండ్



నిందితుడు వడ్డె కాశీ

తాండూరు రూరల్: సులువుగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో ఓ వ్యక్తి లారీని దొంగిలించాడు. దీన్ని విక్రయించేందుకు హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో తాండూరు పట్టణంలో ఓ ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టి అతని మృతికి కారణమయ్యాడు. సదరు వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు శుక్రవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కరన్‌కోట్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కరన్‌కోట్‌కు చెందిన వడ్డె కాశీ జులాయిగా తిరుగుతున్నాడు. సులువుగా డబ్బు సంపాదించాలని భావించి ఈ నెల 9న కరన్‌కోట్‌లోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద ఉన్న ఓ లారీని అపహరించాడు. వాహనాన్ని నడుపుకొంటూ అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో తాండూరు బ్రిడ్జి వద్ద యాలాల మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన కృష్ణ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో కృష్ణ అక్కడికక్కడే మృతిచెందటంతో భయాందోళనకు గురై లారీని బ్రిడ్జి కిందే వదిలేసి రైలులో హైదరాబాద్ చేరుకున్నాడు. నగరంలోని లింగంపల్లి వద్ద ఓ హోటల్‌లో పని చేస్తూ ఏమీ ఎరగనట్లు ఉన్నాడు. నిందితుడు శుక్రవారం కరన్‌కోట్‌కు వచ్చాడని తెలియడంతో పోలీసులు అతన్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వడ్డె కాశీపై కరన్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో లారీ దొంగతనం కేసు, తాండూరులో యాక్సిడెంట్ కేసు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: ఎస్పీ

అనంతగిరి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ కోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. కొందరు యువకులు ఈజీ మనీ కోసం అలవాటు పడి బెట్టింగులు, జూదం వంటి వాటికి బానిసలు అవుతున్నారని తెలిపారు. మత్తుకు అలవాటు పడి తమ బంగారు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్, గుడుంబా వంటివి విక్రయించినా, రవాణా చేస్తున్నా వెంటనే పోలీసులు లేదా డయల్ 100కు గానీ, జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

వివాహిత ఆత్మహత్య

పరిగి: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇబ్రాహింపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ఇబ్రాహింపూర్ గ్రామానికి చెందిన శిరీష(21)కు అదే గ్రామానికి చెందిన నరేష్‌తో రెండు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం జరిగింది. నరేష్ మద్యానికి బానిసై జులాయిగా తిరగడంతో శిరీష మనస్థాపం చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి 13 నెలల బాబు ఉన్నాడు. శిరీష తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు ఉచితంగా గాంధీ చిత్ర ప్రదర్శన

విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించడానికే కార్యక్రమం: డీఈఓ



గాంధీ చిత్రాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

వికారాబాద్ అర్బన్: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించే విధంగా గాంధీ చిత్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి తెలిపారు. శుక్రవారం వికారాబాద్, తాండూర్, పరిగి, మర్పల్లి మండలాల్లోని 8 సినిమా థియేటర్లలో 4,075 మంది విద్యార్థినీ, విద్యార్థులు గాంధీ చలన చిత్రాన్ని వీక్షించినట్లు ఆమె పేర్కొన్నారు. చిత్ర ప్రదర్శన ఈనెల 25 వరకు ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి 1 గంటల వరకు విద్యార్థుల కోసం ఉచితంగా ప్రదర్శించనున్నట్లు డీఈఓ వెల్లడించారు. గాంధీ చిత్రం వీక్షించే విద్యార్థులకు విద్యాశాఖతో పాటు, పోలీస్, మున్సిపల్ శాఖ సహకారంతో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

మహిళ మిస్సింగ్

మర్పల్లి: మహిళ తప్పిపోయిన సంఘటన మర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మర్పల్లి మండలం బిల్‌కల్ గ్రామానికి చెందిన మాల యాదమ్మ(35) జులై 20న రాత్రి 8 గంటల సమయంలో బయటకు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లిపోయింది. అదే రోజు రాత్రి 12 గంటలు దాటినా ఆమె ఇంటికి రాలేదు. చుట్టు పక్కల ప్రాంతాలు, తెలిసిన వారు, బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. ఇంటి నుంచి వెళ్లినప్పుడు పూల చీర, ఆకు పచ్చని జాకెట్ ధరించి వెళ్లినట్లు మరుసటి రోజు కుటుంబీకులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. యాదమ్మ ఆచూకీ తెలిసిన వారు 87026 70038, 87125 83384, లేదా 100కు సమాచారం ఇవ్వాలని ఎస్ కోరారు.

భూ వివాదంలో ఘర్షణ

మోత్కుర్‌లో ఘటన, ఇద్దరికి గాయాలు



కర్రలతో దాడి చేసుకుంటున్న ఇరు వర్గాలు

దోమ: భూ వివాదంలో రెండు కుటుంబాలు ఘర్షణకు దిగిన సంఘటన దోమ మండలం మోత్కుర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ మక్బుల్ అనే వ్యక్తికి సర్వే నంబర్ 519లో కొంత భాగం భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన రంగంపల్లి శివానంద్, చెన్నయ్య, కృష్ణయ్యలకు సర్వే నంబర్ 520లో భూమి ఉంది. సర్వే నంబర్ 519లో కొంత భాగం భూమి తమకు వస్తుందంటూ శివానంద్ వర్గానికి చెందిన వ్యక్తులు భూ కబ్జాకు పాల్పడిన నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయమై మక్బుల్.. తమ భూమిని కబ్జా చేశారని కోర్టును ఆశ్రయించి ఆర్డర్ తెచ్చుకున్నారు. ఆర్డర్ ప్రకారం శుక్రవారం పోలీసులు భూ సమస్యను పరిష్కరించేందుకు ఘటనా స్థలానికి వెళ్లారు. ఇరు కుటుంబాలకు పోలీసులు నచ్చజెప్పి వెళ్లిపోయారు. ఆ తరువాత కోర్టు పరిధిలో ఉన్న భూమి తమకే చెందుతుందని మక్బుల్ కుటుంబ సభ్యులు భూ స్వాధీనానికి వెళ్లగా.. శివానంద్ వర్గానికి చెందిన వ్యక్తులు వారిపై కర్రలతో దాడిచేసి, గాయపరిచినట్లు బాధితులు ఆరోపించారు. ఈ విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేశామని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఎస్‌ఐ రవిగౌడ్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' యత్నించగా ఆయన స్పందించలేదు.

డబ్బుల విషయంలో కత్తితో దాడి

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దేముల్: డబ్బుల విషయంలో ఇరువురు గొడవ జరిగి, ఓ వ్యక్తి కత్తి పోటుకు గురయ్యాడు. చికిత్స పొందుతూ శుక్రవారం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లికి చెందిన ముడావత్ రవి(39) అదే గ్రామానికి చెందిన బాలయ్య వద్ద అప్పు తీసుకున్నాడు. ఈ నెల 12న రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో గ్రామ శివారులోని శ్రీధర్‌రెడ్డి ఫామౌజ్ వద్ద రవి, బాలయ్యలు డబ్బుల విషయంలో గొడవ పడ్డారు. బాలయ్య కత్తితో రవి కడుపు భాగంలో పొడిచాడు. దీంతో రవికి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ముడావత్ శ్రీనివాస్, రఘునాథ్‌లు వెంటనే వైద్య చికిత్స కోసం తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం విషమించడంతో గాంధీకి తీసుకురాగా.. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి అన్న ముడావత్ గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

427 మంది రైతులకు రుణమాఫీ

పెద్దేముల్: రుణమాఫీలో భాగంగా పెద్దేముల్ రైతుసేవా సహకార సంఘం(ఎఫ్ఎస్‌సీఎస్)లో 427 మంది రైతులకు రూ.2.94కోట్ల రుణమాఫీ కానుందని సంఘం మేనేజర్ మురళీగౌడ్ శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 1, 2014 నుంచి డిసెంబర్ 11, 2018లోపు పంట రుణాలు తీసుకున్న రైతులకు మాత్రమే ఈ ఇది వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం సహకార సంఘానికి రూ.85 వేల నుంచి రూ.95 వేల వరకు మాఫీ జాబితా ప్రభుత్వం అందజేసిందని, రూ.లక్ష మాఫీ రైతుల జాబితా వారం రోజుల్లో రానుందన్నారు. 427 మందికి వచ్చిన మాఫీ రుసుంను రైతుల ఖాతాల్లో జమచేస్తామని మేనేజర్ చెప్పారు.

వ్యక్తి అదృశ్యం

కుల్కచర్ల: మానసిక స్థితి సరిగ్గా లేక ఇంటినుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇప్పాయిపల్లికి చెందిన నరేష్ నగరంలోని అంబర్‌పేట్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో మానసికంగా ఇబ్బంది పడుతున్న నరేశ్‌ను కుటుంబీకులు కొన్ని రోజుల క్రితం స్వగ్రామానికి తీసుకువచ్చి ఆరోగ్య సంరక్షణ చర్యలు తీసుకున్నారు. ఈ నెల 8న నగరంలో ఉన్న తన కారును తీసుకువస్తానని ఇంట్లో చెప్పి నగరానికి వెళ్లిన నరేశ్ తిరిగి రాలేదు. తెలిసిన అన్నిచోట్లా వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాధితుడి సోదరుడు వెంకటేశ్ శుక్రవారం కుల్కచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సత్యసీలారెడ్డి తెలిపారు.

వాహనాలతో స్టంట్స్ చేసిన ఏడుగురి అరెస్ట్

అనంతగిరి: స్వాతంత్ర్య దినోత్సవాన అనంతగిరి గుట్టలో కార్లు, బైకులతో విన్యాసాలు చేస్తూ భయభ్రాంతులు సృష్టించిన ఏడుగురు యువకులను శుక్రవారం అదుపులోకి తీసుకుని అరెస్టు నోటీసులు జారీ చేశామని వికారాబాద్ సీఐ శ్రీను తెలిపారు. వీరిలో సనికే శ్రీమాన్, భానుమని తేజ, సంకేత్ కృష్ణ, గణేశ్, అక్షిత్ రెడ్డి, క్రాంతి కుమార్, అర్జున్‌రావు ఉన్నారని స్పష్టంచేశారు. వీరు వాడిన వాహనాలను సైతం సీజ్ చేశామని సీఐ వెల్లడించారు.



తాండూరు టౌన్: శుభప్రద్ పటేల్ ట్రస్టు ఆధ్వర్యంలో..



వికారాబాద్ అర్బన్: కలెక్టరేట్‌లో పాపన్న చిత్రపటానికి అధికారుల నివాళి

బహుజన వీరుడు పాపన్న

బహుజన రాజ్యాధికారం కోసం పోరాడిన మహావీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. పాపన్నగౌడ్ జయంతిని గురువారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, బీసీ కమిషన్ మెంబర్ శుభప్రద్ పటేల్, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, గౌడ సంఘం నాయకులు తదిదరులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



కుల్కచర్ల: ప్రధాన చౌరస్తాలో జయంతి వేడుకలు



కొడంగల్ రూరల్: రుద్రారంలో నివాళి అర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు



దౌల్తాబాద్: మండల కేంద్రంలో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు



బంట్వారం: మండల కేంద్రంలో నివాళులర్పిస్తున్న నాయకులు



బషీరాబాద్: పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



తాండూరు రూరల్: కరన్‌కోట్‌లో నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నేతలు



మర్పల్లి: కొంషేట్‌పల్లిలో గౌడ సంఘం నాయకులు



వికారాబాద్: బీఎస్పీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



పరిగి: పట్టణంలో జయంతి సంబరాలు



తాండూరు టౌన్: పాపన్న గౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు





